చదువు

బైపీసీ, ఎంపీసీ గ్రూపులతో ఇంటర్ పరీక్షలు రాసినవారు వృత్తివిద్యాకోర్సుల్లో చేరటానికి రాసే పరీక్ష..ఎంసెట్. తెలుగు రాష్ట్రాల్లో ఈ ఏడాది నుంచీ దీన్ని తొలిసారిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నారు. సబ్జెక్టుపై పట్టు సాధించటానికి కృషి చేయటంతోపాటు ఆన్‌లైన్ పద్ధతికి అలవాటుపడేలా సాధన చేయటం కూడా విద్యార్థులకు ఇప్పుడు చాలా అవసరం. అప్పుడే ఆశించిన ర్యాంకును సులువుగా సాధించగలుగుతారు!

ఆన్‌లైన్ ఎంసెట్.. అభ్యాసం చేస్తే సులువే!

తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక శాతం ఇంటర్ విద్యార్థుల్లో ఎంపీసీ లేదా బైపీసీ గ్రూపుల్లోనే ఉంటున్నారు. ఈసారి సీనియర్ ఇంటర్ పూర్తి చేస్తున్న విద్యార్థులు 12 లక్షల వరకూ ఉంటే వారిలో దాదాపు ఆరు లక్షలమంది ఇంజినీరింగ్ లేదా మెడికల్ కోర్సుల్లో చేరడానికి ఇష్టం చూపుతున్నారు. వీరిలో దాదాపు 3.5 లక్షల మంది ఇంజినీరింగ్ లేదా అగ్రికల్చరల్, ఫార్మసీ, వెటర్నరీ గ్రాడ్యుయేషన్‌లలో చేరడానికి ఉపయోగపడే పరీక్ష ఎంసెట్ (ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ మెడికల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్).

పి.వి.ఆర్.కె. మూర్తి
చైర్మన్, శ్రీ గాయత్రి విద్యాసంస్థలు

రెండేళ్ల నుంచి వైద్య విద్య ఈ పరిధిలో లేదు. నీట్ ప్రత్యామ్నాయ పరీక్ష అయ్యింది. ఇంజినీరింగ్ విభాగపు విద్యార్థులకు జేఈఈ అడ్వాన్స్‌డ్, జేఈఈ మెయిన్స్, బిట్‌శాట్ లాంటివి ఉన్నప్పటికీ ఇంజినీరింగ్ గ్రాడ్యుయేషన్‌లో చేరడానికి ఎక్కువమందికి ఉపయోగపడుతున్నది ఎంసెట్ మాత్రమే.

గత ఏడాది (2017) ఇంజినీరింగ్ ప్రవేశపరీక్షకు హాజరైన విద్యార్థులు తెలంగాణ- 1,31,899, ఆంధ్రప్రదేశ్- 1,87,484. వీరిలో క్వాలిఫై అయిన విద్యార్థులు తెలంగాణ నుంచి 98,596, ఆంధ్రప్రదేశ్ నుంచి 1,23,974. ఉన్న సీట్ల సంఖ్య క్వాలిఫై అయినవారి కంటే ఎక్కువగానే ఉంది. అయితే విద్యార్థికి గ్రాడ్యుయేషన్ ద్వారా సంపూర్ణ ఫలితం పొందాలంటే సరైన ఇంజినీరింగ్ కళాశాలల్లో సీటు సాధించాలంటే మంచి ర్యాంకు సాధించి యూనివర్సిటీ కళాశాలల్లో తాను ఆశించిన బ్రాంచిలో సీటు పొందే విధంగా ప్రణాళిక, తయారీ ఉండాలి.

ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షల్లో 90% పైగా మార్కులు సాధించే విద్యార్థులు లక్షకు పైగా ఉంటున్నారు కానీ ఎంసెట్‌లో 160 మార్కులకు జరిగే ఈ పరీక్షలో 80 మార్కులకు పైగా సాధించే విద్యార్థులు రెండు రాష్ట్రాల్లో కలిపి 10వేల నుంచి 15 వేలలోపే ఉంటున్నారు. దీనికి కారణం విద్యార్థులకు పరీక్షపై అవగాహన లోపం లేదా ప్రణాళిక పటిష్ఠంగా ఏర్పరచుకోలేకపోవడం! అగ్రికల్చరల్, ఫార్మసీ విభాగపు ఎంసెట్‌కు కూడా గత ఏడాది హాజరైన విద్యార్థులు తెలంగాణ నుంచి 73,000, ఆంధ్రప్రదేశ్ నుంచి 75,489. ఈ సంఖ్య నీట్‌కు హాజరైన విద్యార్థుల కంటే ఎక్కువ. వారిలో అర్హత పొందినవారు వరుసగా 63,570, 55,288.

వంద మార్కులు కష్టం కాదు

ఇంటర్ పూర్తిచేసిన ఎంపీసీ లేదా బైపీసీ విద్యార్థుల్లో ఎక్కువశాతం వృత్తివిద్యా కోర్సుల్లో ప్రవేశానికి ఉపయోగపడే పరీక్ష ఎంసెట్. ఇది కష్టమైన పరీక్ష కాదు. ఎందుకంటే అన్ని ప్రశ్నలూ కచ్చితంగా తెలుగు అకాడమీ పుస్తకాల్లోని వాక్యాల నుంచే వస్తున్నాయి. అందుకే గత ఏడాది తొలి పది ర్యాంకుల విశ్లేషణ చూస్తే 3-5 మార్కులలోపే పూర్తవుతున్నాయి. అంటే పోటీ ఏవిధంగా ఉందో అర్థమవుతుంది. కొందరు విద్యార్థులు 95 శాతంపైగా తెచ్చుకోగలిగితే సాధారణ విద్యార్థి 160 మార్కులకు జరిగే ఈ పరీక్షలో 100 మార్కులు సాధించడం కష్టతరమేమీ కాదు. కావాల్సింది సరైన ప్రణాళిక మాత్రమే.

దరఖాస్తుకు ఇంకా గడువుంది

రూ.500 అపరాధ రుసుముతో దరఖాస్తు పూర్తి చేయడానికి చివరితేదీ ఆంధ్రప్రదేశ్ - ఏప్రిల్ 6, 2018; తెలంగాణలో ఏప్రిల్ 11, 2018. రూ.1000, రూ.5000, రూ.10,000 అపరాధ రుసుముతో ఆంధ్రప్రదేశ్‌లో చివరితేదీలు వరుసగా. . ఏప్రిల్ 11, 16, 21. తెలంగాణలో ఏప్రిల్ 18, 24, 28.

పరీక్ష తేదీలు:

ఇంజినీరింగ్: ఆంధ్రప్రదేశ్- ఏప్రిల్- 22, 23, 24, 25; తెలంగాణ- మే 4, 5, 7.

అగ్రికల్చరల్, వెటర్నరీ, ఫార్మసీ: ఆంధ్రప్రదేశ్- ఏప్రిల్ 25, 26 (రెండు విభాగాలు రాసేవారికి 24, 25) తెలంగాణ- మే 2, 3

ఎంసెట్ 160 ప్రశ్నలతో 3 గంటల వ్యవధితో జరుగుతుంది. ఇంజినీరింగ్ విభాగపు అభ్యర్థులైతే మేథమేటిక్స్-80, ఫిజిక్స్-40, కెమిస్ట్రీ-40 ప్రశ్నలతోనూ, అగ్రికల్చరల్ విభాగంలో బయాలజీ- 80 (బోటనీ 40, జువాలజీ 40), ఫిజిక్స్ 40, కెమిస్ట్రీ 40 ప్రశ్నలతో ఉంటున్నాయి.

ఈ ఏడాది నుంచి రెండు రాష్ట్రాల్లో పరీక్ష ఆన్‌లైన్ విధానంలో జరుగుతోంది. నూతన విధానంలో పరీక్ష 3 లేదా 4 రోజులు జరుగుతుంది. వివిధ రోజుల్లో లేదా ఒకే రోజులో రెండు షిఫ్టుల్లో వేర్వేరుగా పరీక్ష రాసే విద్యార్థులకు వేరు వేరు ప్రశ్నపత్రాలు ఉంటున్నాయి. పరీక్షల్లో ప్రశ్నలస్థాయి కచ్చితంగా ఒకేవిధంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు. ఒకవేళ వేరుగా ఉన్నప్పటికీ వారి మార్కులను నార్మలైజేషన్ చేసి తుది మార్కు ఇస్తారు.

ఇవి గమనించండి

ఎంపీసీ

- మేథమేటిక్స్ 80 మార్కులకు జరుగుతుంది. దీనిలో ఇంటర్మీడియట్, పోటీపరీక్షల ప్రశ్నల్లో వ్యత్యాసం తక్కువ. కాబట్టి దీనిలో 80 మార్కులకు 70 వరకూ సాధించాలి.
- ఫిజిక్స్, కెమిస్ట్రీలకు సమప్రాధాన్యమిచ్చి ఈ సమయంలో అభ్యాసం చేయాలి. అయితే వీటిలో పట్టు సాధించిన అంశాలకు ఎక్కువ సమయం కేటాయించడం మేలు. ఫిజిక్స్, కెమిస్ట్రీల్లో మొత్తం 80 మార్కులకు 40 సాధించినా విద్యార్థి 110 మార్కులకుపైగా సాధించే అవకాశం ఉంటుంది.
- ఆన్‌లైన్ విధానంలో పరీక్ష రాసేటపుడు 'క్వశ్చన్ ఫర్ రివ్యూ' అనేది తక్కువ ప్రశ్నలకే ఇవ్వడం మేలు.
- కనీసం 3 ఆన్‌లైన్ పరీక్షలైనా తుది పరీక్ష రూపంలో రాయాలి. అలాగే పరీక్ష రెండు షిఫ్టుల్లో అంటే ఉదయం 10 గం. నుంచి మధ్యాహ్నం 1 గం. వరకు, మధ్యాహ్నం 3 గం. నుంచి సాయంత్రం 6 గం. వరకు జరుగుతాయి. కాబట్టి అదే సమయంలో పరీక్షలకు అభ్యాసం చేయాలి.

బైపీసీ

- బైపీసీ విద్యార్థులు బయాలజీకి ఎక్కువ ప్రాధాన్యమివ్వాలి. బయాలజీలో 80 మార్కులకు 75కుపైగా సాధించేలా ఉండాలి.
- కెమిస్ట్రీ కూడా గుర్తుంచుకోవాల్సిన జవాబులే ఎక్కువగా ఉంటున్నాయి. కాబట్టి పునశ్చరణకు ఎక్కువ సమయం కెమిస్ట్రీకి కేటాయిస్తే 40కు 30 మార్కులకుపైగా సాధించే అవకాశముంటుంది.
- ఫిజిక్స్ ప్రాథమికాంశాలకు, తక్కువ సమయంలో పునశ్చరణకు అవకాశమున్న చాప్టర్లకు ప్రాధాన్యమిచ్చి పూర్తి చేసుకోవడం మేలు.
- కనీసం 5 నమూనా తుది పరీక్షలను పరీక్ష నిర్వహణ సమయంలోనే రాయాలి.
- రుణాత్మక మార్కులు లేవు. కాబట్టి జవాబులు గుర్తించకుండా వదిలేయొద్దు.
- పరీక్షలో సబ్జెక్టులు రాసే వరుసక్రమం ఇప్పుడు మార్చుకోవద్దు. అలవాటైన పద్ధతిలోనే రాయడం మేలు.
- కొత్త విభాగాలు చదవొద్దు. వచ్చినవాటి పునశ్చరణ ద్వారా ఎక్కువ మార్కులు సాధించుకోవచ్చు.

మౌస్ వాడటం మేలు

పరీక్ష ప్రారంభించడానికి ముందు విద్యార్థి తన వివరాలను పొందుపరచడానికి మాత్రమే కీబోర్డును ఉపయోగించుకోవాలి. పరీక్ష ప్రారంభమైన తరువాత మౌస్‌తోనే జవాబులు గుర్తించడం అలవాటు చేసుకోవాలి.

పరీక్ష రాసేటపుడు కీబోర్డును నొక్కితే సిస్టమ్ హ్యాంగ్ అయ్యి కొద్దిసేపు ఆగిపోతుంది. దీనివల్ల విద్యార్థి ఒత్తిడికి గురయ్యే అవకాశముంది. అయితే ఒకవేళ పొరపాటున కీబోర్డ్‌ను నొక్కితే సిస్టమ్ హ్యాంగ్ అయినపుడు క్లాక్ కూడా ఆగిపోతుంది. మళ్లీ ప్రారంభించినపుడు క్లాక్ కూడా పాత స్థానం నుంచే ప్రారంభమవుతుంది. కాబట్టి విద్యార్థికి సమయం కోల్పోయే ప్రమాదం లేదు. పరీక్ష ప్రారంభం నుంచి ముగింపు వరకు మౌస్ వాడటం మేలు.

ప్రివ్యూ: పరీక్ష ప్రారంభించగానే స్క్రీన్ పైభాగంలో ప్రివ్యూ అనే ఆప్షన్ ఉంటుంది. దానిని వాడుకోవడం ద్వారా ప్రశ్నపత్రం రూపంలో అంటే ప్రింటెడ్ పేపర్‌లా వరుసగా ప్రశ్నలన్నీ కనిపిస్తాయి. ఈ ప్రివ్యూ ద్వారా ఓపెన్ చేసి 160 ప్రశ్నలు ఒకసారి చూసుకుంటే విద్యార్థికి సులభమైన ప్రశ్నలు ఎక్కడున్నాయో అర్థమవుతుంది. అక్కడ సమయం కేటాయించుకోవచ్చు. పరీక్ష రాసేటపుడు ఏకకాలంలో ఒక ప్రశ్న, దానికి సంబంధించిన 4 సమాధానాలు మాత్రమే తెరపై కనపడతాయి. కాబట్టి ఈ ప్రివ్యూను ఉపయోగించడం అలవాటు చేసుకుంటే మేలు.

రివ్యూ: ఒక ప్రశ్నకు సమాధానం రాబట్టవచ్చు.. దానిని తరువాత గుర్తిద్దాం అనుకుంటే రివ్యూలో ఫ్లాగ్ చేస్తే వేరే రంగులోకి మారుతుంది. దీనివల్ల విద్యార్థి సమయం దొరికినపుడు వెంటనే ఆ ప్రశ్నలకు వెళ్లి జవాబులు గుర్తించే అవకాశం ఉంటుంది. టెక్నాలజీ యుగంలో దానిని అనుగుణంగా వాడటం నేర్చుకుంటే విద్యార్థి లాభం పొందినట్లే!

సాధన చాలా ముఖ్యం

పరీక్ష ఆన్‌లైన్ విధానంలో జరుగుతుంది కాబట్టి, గ్రామీణ ప్రాంత విద్యార్థులు నష్టపోయే ప్రమాదముంది. వివిధ పరిశోధన కేంద్రాలు చేసిన సర్వేలో ఒక విద్యార్థిని పరీక్షకు కాగితం, పెన్నుతో అభ్యాసం చేయించి తుదిపరీక్ష కంప్యూటర్‌పై రాయిస్తే వారి సామర్థ్యం 21% తగ్గినట్లు తేలింది. అంటే ఆన్‌లైన్ విధానంలోనే పరీక్ష రాసే విధానాన్ని అభ్యాసం చేయనివారు 20% వరకు నష్టపోయే అవకాశం ఉంది. కాబట్టి విద్యార్థులు ఉన్న ఈ తక్కువ సమయంలో వీలైనన్ని ఎక్కువ పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో అభ్యాసం చేయాలి.

ఆన్‌లైన్‌లో సాధన చేయడం వేరు, పరీక్ష రాయడం వేరు. సాధన చేయడమంటే 20, 30 ప్రశ్నలకు నిర్దిష్ట కాలవ్యవధిలో అభ్యాసం చేయడం. కానీ తుదిపరీక్ష రూపంలో రాయడమంటే సహ విద్యార్థులతో కలిసి 3 గంటలు కంప్యూటర్‌పై అన్ని సబ్జెక్టులకూ సమప్రాధాన్యమిచ్చి రాయడం చేయాలి.

ఎంపీసీ విద్యార్థులకు మిగిలిన అన్ని పరీక్షలూ ఆన్‌లైన్ విధానంలోనే కాబట్టి వారికి కొంత నేర్పు ఉంటుంది. కానీ బయాలజీ విద్యార్థులకు ఇది తొలిసారిగా రాయబోయే ఆన్‌లైన్ పరీక్ష అవుతుంది. వారు విధిగా ఎక్కువ పరీక్షలు అభ్యాసం చేయాలి. బీటెక్ (బయోటెక్నాలజీ)లో చేరాలనుకునేవారు ఇంటర్ బైపీసీతోపాటు మేథమేటిక్స్ బ్రిడ్జ్ కోర్సు పరీక్ష పూర్తిచేసి ఉంటేనే దీనిలో చేరడానికి అర్హులు. అలాగే ఫార్మా-డి కోర్సులోనూ 50% సీట్లు బైపీసీ విద్యార్థులకు 50% సీట్లు ఎంపీసీ విద్యార్థులకు ఉంటాయి.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

కలికిరి సైనిక్ స్కూల్

చిత్తూరు జిల్లాలోని భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన కలికిరి సైనిక్ స్కూల్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: అసిస్టెంట్ మాస్టర్ (టీజీటీ)

సబ్జెక్టులవారీ ఖాళీలు: మ్యాథమేటిక్స్-01, హిందీ-01.

అర్హత, వయసు, ఎంపిక: స్కూలు నిబంధనల ప్రకారం. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్

చివరితేది: 03.05.2018 **వెబ్‌సైట్:** http://kalikirisainikschool.com/

నిమ్‌హాన్స్, బెంగళూరు

సంస్థ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ (నిమ్‌హాన్స్), బెంగళూరు.

పోస్టు: స్టాఫ్ నర్సు **ఖాళీలు:** 160

అర్హత: ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు ఏ గ్రేడ్ నర్సుగా రిజిస్టరై ఉండాలి లేదా బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణతతోపాటు అనుభవం.

వయసు: 30 ఏళ్లకు మించకూడదు.

ఎంపిక: ఆన్‌లైన్ రిక్రూట్‌మెంట్ టెస్ట్, స్కిల్ టెస్ట్ ద్వారా.

పరీక్ష తేది: 03.06.2018

దరఖాస్తు ఫీజు: రూ.1000

చివరితేది: 10.05.2018 **వెబ్‌సైట్:** http://nimhans.ac.in/

ఏఐఐఎస్‌హెచ్, మైసూరు

సంస్థ: ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ (ఏఐఐఎస్‌హెచ్), మైసూరు.

పోస్టులు: టీచింగ్, నాన్ టీచింగ్

ఖాళీలు: 15 **అర్హత, వయసు, ఎంపిక:** నిబంధనల ప్రకారం. **దరఖాస్తు:** ఆఫ్‌లైన్.

దరఖాస్తు ఫీజు: రూ.400

చివరితేది: 13.04.2018

వెబ్‌సైట్: http://aiishmysore.com/

సీఎంఈఆర్ఐ, దుర్గాపూర్

సంస్థ: సెంట్రల్ మెకానికల్ ఇంజినీరింగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఈఆర్ఐ), దుర్గాపూర్, పశ్చిమ్ బంగ.

పోస్టు: టెక్నీషియన్

ఖాళీలు: 39

వర్క్ లొకేషన్: దుర్గాపూర్ (పశ్చిమ్ బంగ), లూధియానా (పంజాబ్).

అర్హత: పదోతరగతితోపాటు ఐటీఐ ఉత్తీర్ణత.

వయసు: 28 ఏళ్లకు మించకూడదు.

ఎంపిక: ట్రేడ్ టెస్ట్, రాతపరీక్ష ఆధారంగా.

దరఖాస్తు: ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: 21.05.2018

హార్డ్ కాపీలను పంపడానికి చివరితేది: 05.06.2018

వెబ్‌సైట్: http://www.cmeri.res.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

టెట్ టాపర్లు చెబుతున్నదేమిటి?

మార్గదర్శకులు లేక... ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ వెనుకడుగు వేయక... పట్టుదలతో చదివిందో అభ్యర్థిని. ఇంటర్ వరకు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువు సాగించినా ప్రతిభకు ఇవేమీ ఆటంకం కాదంటూ నిరూపించాడో అభ్యర్థి. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో అత్యుత్తమ మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానాల్లో నిలిచిన సి.భారతి, యాండ్ర సుబ్రహ్మణ్యంల ప్రిపరేషన్ తీరు గురించి తెలుసుకుందామా?

భారతి

ప్రాక్టీస్ పరీక్షలే కీలకం

మాది కర్నూలు. నాన్న పద్మాజిరావు, అమ్మ హేమ. ఇంటర్ పూర్తయ్యాక....2015-17 విద్యాసంవత్సరంలో డీఎడ్ కోర్సు పూర్తి చేశాను. ఉన్నత చదువులకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవడంతో ప్రస్తుతం దూరవిద్యలో తృతీయ సంవత్సరం చదువుతున్నా. ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)లో పేపర్-1 పరీక్షలో పాల్గొని 150 మార్కులకు 141 మార్కులతో ప్రథమస్థానంలో నిలిచా!

సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికతో చదవటం ముఖ్యం. నగరంలోని ప్రతిభ అకాడమి శిక్షణ కేంద్రంలోని నిపుణుల సలహాల కారణంగా పోటీపరీక్షలో వేగంగా ఎలా సమాధానాలు రాయాలో అవగాహన చేసుకున్నా. ఉదయం, సాయంత్రం శిక్షణ పొంది ఇంటి దగ్గర పనులు చేసుకోవడం అలవాటు చేసుకున్నాను. బోధించిన అంశాలను కాసేపు పునశ్చరణ చేసునే దాన్ని. ఈవిధంగా ఆరు నెలలపాటు కష్టపడ్డా. ఆన్‌లైన్ పరీక్షల సాధన బాగా ఉపయోగపడింది. మూడు నెలల్లో 130కి పైగా ప్రాక్టీస్ పరీక్షల్లో పాల్గొన్నాను. రోజుకు కనీసం 10-11 గంటల పాటు పుస్తకాలతో గడిపితే చాలు, విజయం దానంతటదే వెతుక్కుంటూ వస్తుంది. మా కుటుంబంలో ఉన్నత చదువులు అభ్యసించినవారెవరూ లేక విద్యకు సంబంధించిన సూచనలు, సలహాలు కరువయ్యాయి. ఏవిధంగానైనా సివిల్స్‌లో రాణించి తల్లిదండ్రులకు గుర్తింపు తీసుకురావాలని చిన్నతనంలోనే భావించాను. మొదట ఉపాధ్యాయ వృత్తిపై ఆసక్తి ఉండేది కాదు. ఇంటర్ పూర్తయ్యాక ఖాళీగా ఉండటం ఎందుకని డీఎడ్ కోర్సులో అడుగుపెట్టాక తెలిసింది...ఈ వృత్తి గొప్పతనం. చిన్ననాటి కలలను సాకారం చేసుకోవడానికి శ్రమిస్తాను. ఆ దిశగానే ప్రణాళికలు రూపొందించుకుని ప్రస్తుతం బోధనారంగం వైపు దృష్టి పెట్టా!

- కర్నూలు విద్య, న్యూస్‌టుడే

సుబ్రహ్మణ్యం

సమయం విలువ గ్రహిస్తే సరి..

తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలోని వెలంపేట మా ఊరు. ఇంటర్ పూర్తిచేసి డిగ్రీ చదువుదామంటే ఆర్థికస్థోమత లేదు. ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తేగానీ కుటుంబంలో సమస్యలు తీరే పరిస్థితులు కనిపించడం లేదు. ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెట్టాలని అహర్నిశలు శ్రమించాను. ఒకవైపు ఉపాధ్యాయశిక్షణ పూర్తిచేస్తూనే టెట్‌కు సంబంధించిన అంశాలను తెలుసుకుంటూ కొద్దిపాటి సమయం దొరికినా పోటీపరీక్షపైనే దృష్టిపెట్టాను. 'ఈనాడు' దినపత్రికలో ఉండే ప్రతిభ పేజీలు నాకు ఉపయోగపడ్డాయి. ఉన్న సమయాన్ని సద్వినియోగంచేసుకుంటూ కొద్దిపాటి సమయాన్ని పెంచుకున్నాను. 24 గంటల్లో నిద్రకు కనీసం 8 గంటలు పోతే 16 గంటలు మిగిలి ఉంటుంది. కనీసం 14 గంటలు అయినా కష్టపడి చదవాలనే నిర్ణయం తీసుకున్నాను. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12, 2 గంటల నుంచి సాయంత్రం 6, రాత్రి 8 గంటల నుంచి 11 గంటల వరకు 13 గంటలు పోటీపరీక్షపైనే దృష్టిసారించి పుస్తకాలతో కుస్తీపడ్డాను. రోజుకు మూడు గంటలపాటు రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు శిక్షణ కేంద్రంలో సందేహాలను నివృత్తి చేసుకుంటూ ముందుకుసాగాను. పోటీపరీక్షల అంశాలను తెలుసుకుంటున్న సమయంలో ఒక మార్కు కూడా పోకూడదనే పట్టుదల పెరిగింది. క్షణం కూడా వృథా చేయకుండా పోటీపడ్డాను. 141 మార్కులతో ప్రథమస్థానంలో నిలవగలిగాను.

- న్యూస్‌టుడే, సీతానగరం

జిప్‌మర్‌లో ప్రత్యేక పరీక్ష

వైద్యవిద్యలో ప్రవేశించాలనుకునేవారికి జవహర్ లాల్ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్టుగ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్ (జిప్‌మర్) గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎంబీబీఎస్ కోర్సుకు దేశంలో అఖిలభారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)- న్యూఢిల్లీ తర్వాత జిప్‌మర్ పేరున్న సంస్థ. దీనికి పుదుచ్చేరితోపాటు కరేకల్‌లోనూ క్యాంపస్ ఉంది. ఈ రెండు కేంద్రాల్లోనూ 200 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రవేశానికి ప్రకటన వెలువడింది. జిప్‌మర్ నిర్వహించే ప్రత్యేక పరీక్ష ద్వారా ప్రవేశం లభిస్తుంది.

పరీక్ష ఇలా...

ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్) లో పరీక్షను నిర్వహిస్తారు. వ్యవధి రెండున్నర గంటలు. మొత్తం 200 ప్రశ్నలు వస్తాయి. వీటిలో ఫిజిక్స్ నుంచి 60, కెమిస్ట్రీ 60, బయాలజీ 60, ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్ 10, లాజికల్ అండ్ క్వాంటిటేటివ్ రీజనింగ్ నుంచి 10 ప్రశ్నలు వస్తాయి. ప్రతి సరైన సమాధానానికీ 4 మార్కులు కేటాయించారు. తప్పుగా గుర్తించిన జవాబుకు ఒక మార్కు తగ్గిస్తారు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు నాలుగు చొప్పున ఆప్షన్లు ఉంటాయి. వీటిలో ఒకటి సరైన సమాధానం. ప్రశ్నలన్నీ సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల సిలబస్ నుంచే వస్తాయి. పరీక్షలో అర్హత సాధించడానికి అన్ రిజర్వ్‌డ్ అభ్యర్థులు 50, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలు 40 పర్సంటైల్ సాధించాలి. కనీస అర్హత మార్కులు సాధించిన అభ్యర్థుల జాబితా నుంచి మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు. జిప్‌మర్ పుదుచ్చేరి క్యాంపస్‌లో 150, కరేకల్ లో 50 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి.

అర్హత: ఇంటర్ బైపీసీ గ్రూప్‌లో 60 (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, దివ్యాంగులైతే 50) శాతం మార్కులతో ఉత్తీర్ణత. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు: డిసెంబరు 31, 2018 నాటికి కనీసం 17 ఏళ్లు ఉండాలి. అంటే జనవరి 1, 2002లోగా జన్మించినవారే అర్హులు.

దరఖాస్తులు: ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 13 సాయంత్రం 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

దరఖాస్తు ఫీజు: రూ.1500. ఎస్సీ, ఎస్టీలకు రూ.1200. దివ్యాంగులు ఫీజు చెల్లించనవసరం లేదు.

పరీక్ష: జూన్ 3న ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు

హాల్ టికెట్లు: మే 21 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

పరీక్ష కేంద్రాలు: దేశవ్యాప్తంగా 120 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహిస్తారు. అభ్యర్థులు వారి ప్రాధాన్యం ప్రకారం మూడింటిని ఎంచుకోవచ్చు. వీటిలో ఏదో ఒకచోట పరీక్ష రాసుకునే అవకాశం కల్పిస్తారు. ముందుగా దరఖాస్తు చేసుకున్నవారికి కోరుకున్న కేంద్రాన్ని కేటాయించే వీలు ఉంటుంది. ఏపీలో గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరంల్లో పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. తెలంగాణలో హైదరాబాద్, కరీంనగర్, వరంగల్‌ల్లో పరీక్షలు నిర్వహిస్తారు.

వెబ్‌సైట్: www.jipmer.edu.in